క్లుప్తంగా

కళ్లద్దాల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో 30 మందికి కళ్లద్దాలను చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. గత నెల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో 30 మందికి దృష్టి లోపముందనే అంశాన్ని గుర్తించామని, ఈ క్రమంలో వీరికి కళ్లద్దాలను అందజేశామని ట్రస్ట్ ఏఓ గల్లా కృష్ణ తెలిపారు. ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం, వసంతోత్సవాన్ని వేడుకగా సోమవారం జరిపారు. ఉభయకర్తలుగా చెంగల్‌పట్టు శ్రీధర్, ప్రసన్న, యశ్వంత్, ప్రణీత్‌రెడ్డి, లావణ్య, డాక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తదితరులు వ్యవహరించారు. కాగా మంగళవారం నిర్వహించనున్న యుధిష్ఠర పట్టాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని ఈఓ జానకి తెలిపారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు



జలదంకి: మండల పరిధిలోని 167 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు. మండలంలోని తొమ్మిదోమైలు వద్ద హైవేపై బ్యారికేడ్లను పోలీసులు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులోని ప్రయాణికులు సీట్‌బెల్టులను విధిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దని సూచించారు.

బంగారు ఆభరణాలు మాయం

నెల్లూరు(క్రైమ్): బీరువాలోని బంగారు ఆభరణాలు మాయమైన ఘటనపై కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటరెడ్డినగర్‌లో మాలినీ తన కుమారుడు విద్యాధరణ్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. తలుపులకు గడియపెట్టుకొని తల్లీకుమారుడు ఈ నెల 11వ తేదీ రాత్రి నిద్రించారు. మరుసటి రోజు ఉదయానికి తలుపులు తెరిచి.. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని తొమ్మిది సవర్ల బంగారు ఆభరణలు కనిపించలేదు. దీంతో తన పెద్దకుమారుడు జయధరణ్‌కు తెలియజేశారు. ఘటనపై పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. సోమవారం కేసు నమోదు చేశారు.

తాగునీటి స్వచ్ఛతను పర్యవేక్షించండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. సంతపేటలోని బుజ్జమ్మ రేవులో గల పంప్ హౌస్‌ను సోమవారం తనిఖీ చేశారు. నగరంలోని వివిధ డివిజన్లకు సరఫరా అవుతున్న తాగునీటి వ్యవస్థను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. నిర్దేశించిన ప్రమాణాల మేరకు తాగునీరు స్వచ్ఛంగా ఉండేలా పరీక్షలను రోజూ జరపాలని ఆదేశించారు. అనంతరం పొర్లుకట్టలోని బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్ర నిర్వహణకు అనుమతులు, తయారీ విధానంలో పాటిస్తున్న జాగ్రత్తలు తదితరాలను పరిశీలించారు. నగరంలోని కొన్ని ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలను పొర్లుకట్టలో డంప్ చేస్తున్నారనే ఫిర్యాదు నేపథ్యంలో తనిఖీ చేశారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, డీఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

➡ ఎన్నికల నిర్వహణలో బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించాలని నెల్లూరు నగర నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నందన్ పేర్కొన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని బీఎల్వోలకు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి సమస్యలు, అనుమానాలున్నా తనతో పాటు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఏఈఆర్వో షఫీమాలిక్, ఎన్నికల డీటీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సాగరమాల ప్రాజెక్ట్‌కు సహకరించాలి

• నెల్లూరు ఆర్డీఓ నాగఅనూష



మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష

ముత్తుకూరు(పొదలకూరు): కృష్ణపట్నం – తమ్మినపట్నం సాగరమాల ప్రాజెక్ట్ కింద చేపట్టే రోడ్డు నిర్మాణానికి రైతులు తమ భూములను అందజేసి సహకరించాలని నెల్లూరు ఆర్డీఓ నాగఅనూష కోరారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పనులైనందున రైతులు సహకారం అవసరమన్నారు. ప్రాజెక్ట్ భూసేకరణలో భాగంగా సోమవారం ముత్తుకూరు తహసీల్దార్ కార్యాలయంలో అవార్డు విచారణకు హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం కోసం భూముల అలైన్మెంట్ సర్వే జరిగిందన్నారు. భూముల పొజిషన్‌లో ఏ రైతులున్నారో తమ రెవెన్యూ అధికారులు, సిబ్బంది విచారణ చేపట్టి నివేదికను ఆర్డీఓ కార్యాలయానికి పంపడం జరుగుతుందన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా భూసేకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. తర్వాత అవార్డు ప్రకటించి రైతుల అభ్యంతరాలు, సందేహాలుంటే నివృత్తి చేస్తామన్నారు. ప్రస్తుతం సాగరమాల ప్రాజెక్ట్ కోసం రైతుల భూములు ఎకరానికి రూ.14 లక్షలు నిర్ధారించినట్లు చెప్పారు. అయితే రైతులు ప్రతి శనివారం కలెక్టర్ వద్ద నిర్వహించే ఆర్బిట్రేషన్ (మధ్యవర్తిత్వం)కు హాజరై తమ అభ్యంతరాలు వెల్లడిస్తే మరో 40 శాతం కలెక్టర్ అదనంగా అందజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పెద్ద ప్రాజెక్టు అయినందున రైతులు న్యాయపరంగా వెళ్లకుండా సహకరించాల్సిందిగా కోరారు. ట్రిబ్యునల్ కోర్టుకు వెళితే జాప్యం జరుగుతుందన్నారు. నారికేళ్లపల్లి గ్రామంలో ఒక్కరైతే అభ్యంతరం వ్యక్తం చేశారని, మాట్లాడతామన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ స్వప్న ఉన్నారు.

న్యాయం చేసి ఆదుకోండయ్యా..



తహసీల్దార్‌కు సమస్యను తెలియజేస్తున్న రమణమ్మ

కోవూరు: తన ఇంటిని ఆక్రమించారంటూ గుమ్మళ్లదిబ్బకు చెందిన వృద్ధురాలు రమణమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు తహసీల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. గుమ్మళ్లదిబ్బలో 50 ఏళ్లుగా ఉంటున్నానని, తన భర్త, కుమారుడు మరణించారని చెప్పారు. ఇందిరమ్మ హౌసింగ్ పథకంలో స్థలం లభించగా, చిన్న ఇంటిని నిర్మించుకున్నామని తెలిపారు. ఆస్పత్రికి ఇటీవల వెళ్లొచ్చేలోపు ఇంట్లోని సామగ్రిని బయటపడేశారని, ప్రశ్నించగా, తనను నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. తనను ఆదుకోవాలని కోరారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఆనంద్

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. పీజీఆర్‌ఎస్ అర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనులు, పీ4, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు తదితర అంశాలపై సబ్ కలెక్టరు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులతో కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పీ4 కార్యక్రమ అమల్లో భాగంగా రానున్న రెండు వారాల్లో కనీసం 50 వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా మార్గదర్శులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ ప్రక్రియ ఆన్‌లైన్లో జరగనుందన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల్లో పురోగతి సాధించాలని చెప్పారు. ఇళ్లు పూర్తయ్యేలా ఎంపీడీఓలు, హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. హౌసింగ్‌లో ఉపాధి హామీని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలను కల్పించాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, డీఈఓ బాలాజీరావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• పీ4లో ఆర్థికాంశాలే కాకుండా బంగారు కుటుంబాలను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. పీ4 కార్యక్రమంపై కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 15 నాటికి జిల్లాలో 50 వేల నుంచి 60 వేల మంది మార్గదర్శులను నియమించాల్సి ఉంటుందని చెప్పారు.

• పీ4 అమల్లో భాగంగా జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాల పునఃధ్రువీకరణ నిమిత్తం గ్రామ సభలను ఈ నెల 15 నుంచి 25 వరకు నిర్వహించనున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. జాబితాలో ఏవైనా వ్యత్యాసాలుంటే వాటిని సరిదిద్దాలని కోరారు.

ధ్యానంతో సుఖమయ జీవనం



నెల్లూరు(బృందావనం): మౌనం, ధ్యానంతో శాంతి, ఆనందకరమైన జీవనాన్ని పొందగలమని బౌద్ధభిక్షువులు తెలిపారు. నగరంలోని దత్త పీఠాశ్రమం, కొత్తూరులోని వెంకయ్యస్వామి ఆశ్రమాలతో పాటు వివిధ ధ్యాన మందిరాలను కొవానే పాలితథెరో (శ్రీలంక), షిమాడ (జపాన్), బోధిహీన్ (భారత్) తదితర బౌద్ధసన్యాసులు సోమవారం సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. రాగి, బిల్వ మొక్కలు నాటారు. రామాయణం మహేష్‌స్వామి, ఆనందస్వామి, పర్వతస్వామి, రామాయణం జగదీష్‌శర్మ, సునీల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మణిశంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం తగదు



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని తొమ్మిదో డివిజన్లో పారిశుద్ధ్య పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం తగదని, దీన్ని ఆపకపోతే అన్ని విభాగాల కార్మికులు విధులను బహిష్కరించి మెరుపు సమ్మె చేపట్టనున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచలనరసయ్య పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఎదుట సోమవారం చేపట్టిన ధర్నాకు పలువురి నుంచి మద్దతు లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ ప్రక్రియకు మంత్రి నారాయణ శ్రీకారం చుట్టారని ఆరోపించారు. ఇంజినీరింగ్ విభాగ కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సరైన సమాధానం మంగళవారం సాయంత్రంపు రాకపోతే విధులను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చెన్నుడికి వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి నాగేశ్వరరావు, రూరల్ నేతలు మాలకొండయ్య, కోటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు అశోక్, మట్టిపాటి శ్రీనివాసులు, కొండమ్మ, కిరణ్, రాంబాబు, మునిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ దరఖాస్తుల గడువు పొడిగింపు

పొదలకూరు: స్థానిక పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2025 – 26 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో చేరేందుకు రెండో విడత దరఖాస్తుల గడువును పొడిగించినట్టు ప్రిన్సిపల్ సాంబమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాల్సిందిగా సూచించారు. కంప్యూటర్ ఆపరేటింగ్, హార్టికల్చర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ తదితర కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 22వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. మహిళలకు సూయింగ్ శిక్షణలో భాగంగా మోడరన్ మెషీన్లపై ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం మాముడూరు రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చేజర్ల మండలం నడిగడ్డ అగ్రహారం గ్రామానికి చెందిన తూపిలి వెంకటేశ్వర్లు, మరో వ్యక్తి మోటార్ బైకులపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు మృతిచెందాడు. మరో వ్యక్తి గాయపడినట్టు సమాచారం.

కిలో పొగాకు సగటు ధర రూ.211

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు సగటు ధర రూ.211.64 లభించింది. వేలానికి 787 బేళ్లు రాగా, 689 బేళ్లను విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.211.64 ధర పలికిందని వివరించారు. వేలంలో పది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

చెరువులో జారిపడి..

• వ్యక్తి మృతి

సంగం: చెరువులో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వంగల్లులో చోటు చేసుకుంది. వివరాలు.. వంగల్లు గ్రామానికి చెందిన పి.శ్రీనివాసులు (50), అరుణమ్మ దంపతులు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. శ్రీనివాసులు వ్యవసాయకూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పి ఇంటి నుంచి వచ్చాడు. అర్ధరాత్రి అయిన తిరిగి రాకపోవడంతో భార్య, బంధువులు అన్నిచోట్ల వెతికారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం శ్రీనివాసులు చెరువులో శవమై కనిపించాడు. బహిర్భూమికి వెళ్లి కాలి జారిపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు మృతదేహాన్ని సంగం పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏబీవీపీ నగర కమిటీ నియామకం



నెల్లూరు(టౌన్): ఏబీవీపీ నగర నూతన కార్యవర్గాన్ని నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం ఎన్నుకున్నారు. నగర కార్యదర్శిగా మౌనీష్, సహాయ కార్యదర్శులుగా ఆదిత్య, మదన్, సుజిత్, వీరశంకర్, నగర జోనల్ ఇన్‌చార్జీలుగా గణేశ్, మనోహర్, మనోజ్, సిటీ హాస్టల్ కన్వీనర్‌గా సుకుమార్, ఎస్పెఫ్టీ కన్వీనర్‌గా జగదీష్, ఎస్సెఫెస్ కన్వీనర్‌గా కొండయ్య, ఖేలో భారత్ నగర కన్వీనర్‌గా అమర్‌నాథ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా రాబర్ట్, కార్యవర్గ సభ్యులుగా లోకేశ్, శంకర్, శ్యామ్, గౌరీశంకర్ ఎన్నికయ్యారు. జిల్లా ప్రముఖ్ గంగాధర్, విభాగ్ సంఘటన కార్యాదర్శి భరత్‌కుమార్, జిల్లా కన్వీనర్ హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



ఫైర్ స్టేషన్ నీటి తొట్టెలో చేపలను వదులుతూ..

పొదలకూరు: పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. దోమల లార్వాలను నాశనం చేసేందుకు సోమవారం నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో గంబూసియా చేపలను వదిలి పెట్టారు. ఈ సందర్భంగా కో – లోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌రిషిత మాట్లాడుతూ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సూచనల మేరకు శ్రీనివాస లేఅవుట్ వాటర్ ట్యాంక్ వద్ద, ఎమ్మార్వో కాలనీ ఫైర్ స్టేషన్ నీటి తొట్టెల్లో గంబూసియా చేపలను వదిలిపెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, ఆరోగ్య సహాయకులు కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, అరుణ, చిత్ర, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ వరలక్ష్మి, ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, సాని శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



గంబూసియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడ పీహెచ్‌సీ పరిధిలో దోమల నివారణ చర్యలను సిబ్బంది సోమవారం చేపట్టారు. జొన్నవాడ, మినగల్లు గ్రామాల్లోని కొలనుల్లో దోమలు, లార్వా నివారణ కోసం గంబూసియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా డాక్టర్ అహ్మద్‌బాబు మాట్లాడారు. ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. డాక్టర్ అవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నకు పరామర్శ



కోవూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఇందుకూరుపేట మండలం జంగందొరువు సర్పంచ్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు సోమవారం కలిశారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.

హత్య కేసు నిందితుల కోసం గాలింపు

• సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా పట్టుకునేందుకు యత్నాలు

ఉదయగిరి: పట్టణంలో మూడు రోజుల క్రితం ఆస్తి వివాదం నేపథ్యంలో షేక్ మహ్మద్ హమీద్‌ను కిరాతకంగా హత్య చేసి పరారైన గుంటుపల్లి ఉమర్‌అలీ, హనీఫ్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. వింజమూరు, కలిగిరి, వరికుంటపాడు ఎస్సైల ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందాలు నిందితుల కోసం వేట సాగిస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న పలువురు యువకులను పోలీసులు సోమవారం ఉదయగిరి స్టేషన్‌కు పిలిపించి విచారించి వారి వాంగ్మూలాలను రికార్డు చేశారు. హత్య దృశ్యాలను సెల్‌లో చిత్రీకరించడం.. ఆ దృశ్యాలు వైరల్ కావడంతో భయపడి పరారీలో ఉన్న ఆరీఫ్ స్టేషన్‌కు స్వయంగా వచ్చి పోలీసులకు వివరాలు తెలిపారు. సదరు యువకుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులను పోలీసులు ఇబ్బంది పెడుతున్నారంటూ ఆదివారం రాత్రి బంధువులు ఆందోళన చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం యువకుడు స్టేషన్‌కు వచ్చారు. హత్యను చిత్రీకరిస్తుండడాన్ని నిందితులు చూశారని, హత్యానంతరం తనపై దాడికి చేసేందుకు ప్రయత్నించగా వారి నుంచి తప్పించుకుని భయపడి వేరే చోటుకు వెళ్లి తల దాచుకున్నట్లు పోలీసులకు తెలిపారు.

నిందితుల పరారీలో పోలీసుల వైఫల్యం

ఈ నెల 11న సాయంత్రం 6.55 గం సమయంలో హత్య జరిగింది. కేవలం ఐదు నిమిషాలలోపే పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై ఆళ్ల శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికి కొద్ది నిమిషాల ముందే నిందితులు పరారయ్యారు. నిందితులు ఎవరు అనేది ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. వెంటనే పోలీసులు అన్ని స్టేషన్లను అప్రమత్తం చేసి ఉంటే ఖచ్చితంగా నిందితులు దొరికేవారనే వాదనలు ఉన్నాయి. హత్య చేసిన తరువాత నిందితులు తమ వద్ద ఉన్న స్కూటీపై గోదాము వరకు వెళ్లి అక్కడి నుంచి కారులో పరారయ్యారు. వారు గండిపాళెం రోడ్డులో పామూరు చేరుకున్నట్లుగా తెలుస్తోంది. పోలీసులు వెంటనే అప్రమత్తమై ఉంటే సిగ్నల్స్ ఆధారంగా నిందితులను పట్టుకునే అవకాశం ఉండేదని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే హత్య జరిగిన వెంటనే తాము ఇతర స్టేషన్ల పోలీసులను అప్రమత్తం చేశామని, అయినా ఫలితం లేదని పోలీసులు చెబుతున్నారు. నిందితుల ఆచూకీ దాదాపు పోలీసులకు అందుబాటులో ఉన్నట్లుగా తెలుస్తోంది. నిందితులను పోలీసులకు అప్పగించేందుకు వారి సమీప బంధువు పోలీసుల అధికారులతో సంప్రదింపులు కూడా జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రెండ్రోజుల లోపే నిందితులు పోలీసుల కస్టడీలోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. వారిని విచారిస్తే కేసులో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా? ఉంటే ఎవరూ ఉన్నారు.. అనే సమాచారం తెలిసే అవకాశం ఉంది.

పనులు కల్పించలేదని కూలీల ఆగ్రహం



ఎంపీడీఓను నిలదీస్తున్న కూలీలు

ఉదయగిరి: కుర్రపల్లి బీసీ కాలనీలో రాజకీయంతో ముడిపెడుతూ మూడు నెలలుగా ఉపాధి పనులు కల్పించకపోవడంపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామంలోని ఓ టీడీపీ గ్రూపునకు చెందిన వారు చెప్పినట్లుగా వింటూ ఇతర కూలీలకు అన్యాయం చేస్తారని ఎంపీడీఓ అప్సాజీని నిలదీశారు. ఉద్యోగం చేస్తారా లేక రాజకీయం చేస్తారా అంటూ ఎంపీడీఓపై విరుచుకు పడ్డారు. ఉపాధి సిబ్బందిని ఎన్నిసార్లు అడిగినా పనులు చూపకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులు కల్పించకపోతే ఎంపీడీఓపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

యువకుడి మృతదేహం గుర్తింపు



యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఉమాశంకర్

కలిగిరి: మండలంలోని నాగిరెడ్డిపాళెం సెంటర్ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు వద్ద వీర్నకొల్లు పొలాల్లో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని సోమవారం రైతులు గుర్తించారు. కలిగిరి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ఎం ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్యన వయస్సు ఉండొచ్చు. కుడి చేతిపై సత్యవతి, సింహం బొమ్మవేసి వంశీ, కళ్యాణి అని తెలుగులో రాసిన పచ్చబొట్లు ఉన్నాయి. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. కాగా ఆదివారం యువకుడు అతిగా మద్యం సేవించి నాగిరెడ్డిపాళెం సెంటర్‌లో తిరిగినట్లుగా స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతిగా మద్యం సేవించడం వల్ల దప్పికతో గొంతు తడి ఆరిపోయి యువకుడు మరణించి ఉండొచ్చని భావిస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440700098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.